


నాటి ఆదిమానవులు మొదలుకొని నేటి ఆధునిక మానవులందరూ తమ అనుభవం, అనుభూతిలోనికి వచ్చిన ప్రతి దానిని వింతైనది గానో, నూతనమైనదిగానో చెప్పడం జరుగుతున్నది. ప్రకృతిని పరిశీలిస్తూ, పరిశోధిస్తూ తన కళ్ళకు కనిపించిన వాటినన్నింటిని కొత్తవిగానో లేక తానే కనుగొన్నదిగానో చెప్పి ఒక ప్రత్యేక ఆనందాన్ని పొందటం అలవాటు చేసుకొన్నాడు. అయితే తాను చూసింది మరియు కొత్తగా కనుగొన్నాను అనుకున్నది అప్పటికే ఉంది అనే ఆలోచన చేయకపోవడమే ఆశ్చర్యకరమైన ప్రధానాంశం. మనిషి తన జీవిత కాలాన్ని లెక్కగట్టుకోవడానికి మరియు దేవున్ని ఆరాధించడానికి సృష్టించిన కాలాన్ని (అపో.కా. 17:26) తన ఇష్టానుసారంగా విడగొట్టి, విపరీతంగా ప్రవర్తించి ప్రకృతిని పాడుచేస్తూ, ఆ దేవుని సంకల్పాన్ని ధిక్కరించడమే అన్యాయము అక్రమము అని చెప్పక తప్పదు.

నేటి అనారోగ్య, ఆర్థిక మాంద్యమున్న దినాల్లో ఈ నూతన సంవత్సర వేడుకలు రోజు, రోజుకు అధికమై ఎన్నో వింతపోకడలకు, విపరీతాలకు దారి తీస్తుంది. ఒకప్పుడు క్రైస్తవులు మాత్రమే భక్తితో, ప్రత్యేకంగా జరుపుకొనే ఈ పండుగ, నేటి క్రైస్తవేతరులు కూడా ఎంతో ఘనంగా జరుపుతున్నారు. కొందరు దీనిని బిజినెస్‌గా మార్చి క్యాష్ చేసుకొంటున్నారు. ఆశ్చర్యమేమంటే చైనా, రష్యా, జపాన్‌లాంటి దేశాలుగూడా ఈ వేడుకలు ఘనంగా జరుపుతున్నాయి. క్రైస్తవులు చర్చిల్లో ఈ కొత్త సంవత్సరం కోసం ప్రార్థనతో, కృతజ్ఞతతో ఎదురుచూస్తే, క్రైస్తవులు కాని వారంతా ఇంట్లో, క్లబ్బుల్లో, హోటల్స్‌లో, పార్కుల్లో మరియు ప్రత్యేకమైన స్థలాల్లోనో పాటలు, డ్యాన్స్‌లు, జోక్‌లు,

కేక్‌లతో ఆనందడోలికల్లో తేలియాడుతూ, తన్మయత్వంతో తనువులు మరచిపోతూ, ఆ తరువాత మత్తులో తమ ప్రాణాలను పోగొట్టుకొంటున్నారు. అయితే మరో విచిత్రమేమంటే ఈ క్రొత్తదానిని గూర్చి తెలియక, తెలిసినా పట్టించుకోక దుప్పటి కప్పుకొని పడుకొన్న వారికి కూడా ఈ సంవత్సరం అనేది వచ్చి తీరుతుందనే విషయాన్ని అనేకులు విస్మరిస్తున్నారు. ఎందుకంటే ఎవరు స్వాగతించినా, స్వాగతించకపోయినా కాలము ఎవరికోసం ఆగదుగదా.

ఇంతకీ సర్వేశ్వరుడైన దేవుడు, సర్వోన్నతుడు, సర్వసృష్టికి కారణభూతుడై మనందరినీ కన్న తండ్రియైన ఆ పరమాత్ముడు జీవాత్మయైన మన కోసం ఎప్పుడో తన భక్తుల ద్వారా వ్రాయించిన మనుషులందరి బ్రతుకు పుస్తకమైన బైబిల్ గ్రంథములో ఈ కాలాలను గూర్చి ఏమి వ్రాయించాడో చూద్దాం.

దేవుడు ఒకనాడు, (క్రీస్తు పూర్వం) తన ప్రజలుగా ప్రత్యేకంగా ఎంచుకొన్న జనులైన ఇశ్రాయేలీయులు తనను ఆరాధించడానికి వారికిచ్చిన ధర్మశాస్త్రములో కొన్ని నియామక కాలాలను, పండుగలను నియమించాడు. మొదటిసారిగా వారు ఐగుప్తు బానిసత్వములో నుండి విముక్తి పొందిన రోజును జ్ఞాపకముంచు కోవడానికి వారికి అప్పటి నుండి మొదటి సం॥, మొదటి నెల, మొదటి దినంగా పాటించమన్నాడు. ఆనాటి పస్కాబలి పండుగే క్రీస్తు బలియాగానికి చిహ్నం. వారి మొదటి నెల నీసానుమాసం నేటి మన తెలుగు క్యాలెండరు ప్రకారం చైత్రమాసం. వారి మొదటి రోజు మన తెలుగువారికి ఉగాది పండుగరోజు. అనగా క్రీ॥పూ॥ మనమనుకొంటున్న నూతన సంవత్సరం నేటి ఇంగ్లీషు క్యాలెండరు ప్రకారం మార్చి - ఏప్రిల్ మధ్యలో వచ్చేదన్నమాట. కాని వారు నెలలను, దినాలను, సం॥రాలను 1,2,3... ఇలాగే పిలిచేవారు గాని క్రొత్తది అని పిలిచి, పండుగ చేసుకొన్న ఆధారాలు లేవు అని గమనించాలి.

ఈలోకంలో మహాజ్ఞానియైన సొలొమోను మహారాజు తాను లోకానికిచ్చిన జ్ఞానం, సామెతలలో వ్రాసిన వాటిని చదివితే అందరూ ఆలోచిస్తే నేడు ఈ వేడుకల్లో జరుగుతున్న ఎన్నో అపశృతులను ఆపి, ధన, మాన, ప్రాణాలను రక్షించుకోవచ్చు. అవునో కాదో ఒకసారి ఒకసారి బైబిల్‌లోని ఈ మాటలను చదవండి ఆలోచించండి.

“ఎడతెరిపి లేకుండా సమస్తము జరుగుచున్నది. మనుష్యులు దానిని వివరింపజాలరు. చూచుట చేత కన్ను తృప్తి పొందకున్నది. వినుట చేత చెవికి తృప్తి

కలుగుటలేదు. మునుపు ఉండినదే ఇక ఉండబోవునది, మునుపు జరిగినదే ఇక జరుగబోవునది సూర్యునికింద నూతనమైనదేదియు లేదు. ఇది నూతనమైనదని యొకదాని గూర్చి ఒకడు చెప్పును. అదియును మనకు ముందుండిన తరములో ఉండినదే... (ప్రసంగి 1:8-10).

మండుచున్న సూర్యగోళం క్రిందనున్న ఈ పంచభూతాలలో అనగా మానవ నివాసయోగ్యమైన భూగోళంలో ఉన్నదాంట్లో నూతనమైనదేదియు లేదని, అంతా ఎప్పుడో నేను సృష్టించిన అతి పురాతనమైనదని చెప్పేశాడు. అయితే ఎవడో ఒకడు తనకు పుట్టిన బుద్ధితో ఏదో ఒకదానిని గూర్చి ఇది కొత్తది అని చెప్తాడు దానినే మనుషులందరూ దేవుని ఉపదేశంగా భావించి ఘనంగా చేస్తారు అని గూడా చెప్పించాడు (మార్కు 7:6-9). ఒకనాడు యూదుల పైన ఉన్న కోపంతో ఆనాటి రోమా చక్రవర్తియైన జూలియస్ సీజర్ (క్రీ.పూ. 45 సం॥లో 45 బి.సి. ఇతనిపేరు మీదనే జూలై నెలగా పిలువబడుతుంది) బైబిల్‌లో దేవుడు వారికిచ్చిన ప్రారంభ దినాన్ని, నెలను మార్చి (మార్చి... ఏప్రిల్ మధ్యలో వచ్చే నేటి ఉగాదిని) జనవరి మొదటి దినానికి మార్చివేశాడు అని చరిత్రలో వ్రాయబడింది. దానినే నూతన సం॥ వేడుకగా పాటించాలని ఆ తర్వాత వచ్చిన వారు గూడా శాసించారు గనుకనే అనంతమైన కాలానికి నూతనత్వం ఏర్పడింది ఇది అర్థంకాని క్రైస్తవులు కూడా పనికట్టుకొని క్రొత్త సం॥ కోసం ఎదురుచూసి, పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతున్నారు. వీటిని పాటించవద్దని దేవుడు చెప్పినా (గలతీ. 4:1-8, కొలస్సి 2:16) గుడ్డిగా ఆచరిస్తూ అనేకులు ఆచరించేవారుగా మన క్రైస్తవులే మార్గదర్శకులైనారు. దేవుడు అప్పుడే (ఇప్పటికి కాదు) కనిపెట్టమన్నది, ఎదురు చూడమన్నది, క్రొత్తభూమి, క్రొత్త ఆకాశం, క్రొత్త లోకం (పరలోకం) కోసం మరియు ఈ యుగాంతం కోసం సంతోషంగా, భక్తితో ఉండండి అనేది (2పేతురు 3:8-13) మర్చిపోయి సాతాను మాయలో పడ్డారు.

వాచ్‌నైట్ వాగ్ధానాల పేరుతో క్రీస్తు విరోధులుగా మారిపోతున్నారు. ఎందుకంటే బైబిల్‌లో ఉన్న వాగ్ధానాలన్నీ (నిర్గమ కాండం నుండి మలాకీ గ్రంథం వరకు) ఇశ్రాయేలీయులవే కానీ క్రైస్తవులవు కావు (రోమా 9:4). క్రీస్తు ద్వారా తన వద్దకు రావాలని ఆశించిన ప్రతి వారికీ దేవుడు తన కుమారుని ద్వారా వాగ్ధానాలను కాక ఆజ్ఞలనిచ్చాడు (మత్తయి 28:18-20, లూకా 6:46-49, మత్తయి 7:7-27). ఆనాడు ఇశ్రాయేలుకిచ్చిన వాగ్ధానాలలో ఒకదానిని నేడు తీసుకొని ఒక సంవత్సరం మొదటిరోజు

ఆనందించక క్రీస్తు బోధలోని ప్రతి వాక్యంతో ప్రతిరోజూ ఆనందించి, ఆయన పనికోసం ఆయన రాకకోసం మనుష్యులందరి విముక్తికోసం జాగ్రత్తగా కనిపెట్టాలి. మనకు తెలిసినా తెలియని వారినైనా క్రీస్తునొద్దకు నడిపించి, దేవుని యొద్దకు చేరే భాగ్యం కల్పించాలి. ఇది కాలాతీతమైన దేవుని సంకల్పం.

సిలువ వేయబడిన క్రీస్తు బోధలో అనగా నూతన నిబంధనలో, దేవునిలో ఉండాల్సిన వారికి కాలాన్ని, సమయాన్ని అందరికీ తండ్రియైన దేవుడు తన స్వాధీనంలో ఉంచుకొన్నాడని, వాటిని తెలుసుకొనుట మనుషులకసాధ్యమని (అపో.కా. 1:8) యేసుప్రభువు చెప్పినా ఆనందం అనే ముసుగులో తినుటకు, త్రాగుటకు కూర్చుండి ఆ తర్వాత లేచి ఆడుటకు, పాడుటకు కాలానికి నూతనత్వమిచ్చి తన బ్రతుకును ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా, దైవికంగా నాశనం చేసుకున్నాడు. మనిషి తాను సృష్టించిన దాంట్లో పాతది, కొత్తది, వింతైనదేమైనా ఉంటే ఉండవచ్చునేమో గాని దేవుని సృష్టిలో, మానవుని దృష్టిలో ఆది - అంతం లేని అతి విలువైనది, మనిషి చేసే ప్రతి పనిని గూర్చి తీర్పు తీర్చేది లేదా సమాధానం చెప్పేది, మనిషికి తగిలే ప్రతి గాయాన్ని మాన్పివేసే దివ్యఔషదమైన కాలానికి కొత్తదనం, పాతదనం అనేవి లేవు. రేపటిని గూర్చి ఎదురుచూసి, అది జరక్కపోతే చింతించకు అన్నాడు (మత్తయి 7:34). ఎందుకంటే రేపటికి నీవు ఉంటావో లేదో రేపేమి జరుగునో నీకు తెలియదు (యాకోబు 4:14) అన్నాడు దేవుడు. అయినా మనిషి రేపు మారుతాను, నూతన సంవత్సరం నుండి పాడు పనులన్నీ, దురలవాట్లన్నీ మానివేస్తాను అని పనికిమాలిన ప్రణాళికలు వేసుకొంటూ తన్నుతానే మోసం చేసుకొంటున్నాడు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి గాని దానిని టైమ్‌పాస్ చేస్తూ విలువైన కాలాన్ని నాశనం చేసుకోకూడదు ఎందుకంటే టైమ్ ఈజ్ మనీ అంటున్నాము కదా!

ఇలాంటి వ్యర్థమైన ఆచారాలతో తనను వ్యర్థముగా ఆరాధిస్తారని ముందే ఎరిగిన దేవుడు తన సృష్టిలో ఏదీ నూతనమైనది నేను చేస్తానో, ఏది నూతనమైనది మనిషి చేసి చూపించి దేవునిని ఆనందపరచాలో మన సత్యవేదమైన బైబిల్‌లో వ్రాయించాడు. దేవుడు ఆశించిన దానిని నిత్యనూతనమైనదిగా మనం మార్చుకొంటూ ఆయనను పూజించి, స్తుతించి, ఆరాధించడమే సర్వమానవాళిముందున్న తక్షణ కర్తవ్యం సుమా. క్రీ॥పూ॥లోనే తాను ఎంచుకున్న ప్రజల ద్వారా ఈ యుగాంతమందున్న మనకు బుద్ధిగలగడానికి దేవుడు చెప్పిన మాటలు చదవండి. "నూతన హృదయాన్ని, నూతన మనస్సును, మీలోని రాతిలాంటి గుండెను మళ్ళీ మాంసపు గుండెగా మార్చి కొత్తదానిగా

మారుస్తాను అని వాగ్దానం చేశాడు. (యెహెజ్కేలు 36:26). ఈ వాగ్దానాన్ని త్వరగా నెరవేర్చమని సంవత్సరాలను కాకుండా తన కార్యములను నూతనమైనవిగా చేయమని ప్రవక్తయైన హబక్కూకు దేవునికి ప్రార్థన చేశాడు (హబక్కూకు 3:1,2). తన సృష్టిలోనూ, దానిని నడిపిస్తున్న కాలములోను కొత్తదనం లేదని తెలిసినా తన కుమారుడుకొత్తదనాన్ని కోరుకుంటాడని ముందే ఎరిగిన దేవుడు ఆ క్రొత్తదనాన్ని ఎలా రుచిచూచి ఆస్వాదించాలో సర్వమానవాళికి చేసిన క్రీస్తు బోధలో వివరంగా వివరించాడు. ఇది నూతన నిబంధనలో ఆయన ప్రియ కుమారుడు, లోకరక్షకుడైన క్రీస్తు ద్వారా నెరవేరింది. క్రొత్త సంవత్సరం పేరుతో పాత పద్ధతులను అవలంభించేవారు దీనిని ఎట్టి పరిస్థితిలో గ్రహింపలేరు.

మనుషులందరు తమ పాత మనస్తత్వాన్ని మార్చుకొని బాప్తీస్మము ద్వారా నూతన జన్మ ఎత్తిన వారికి సమస్తాన్ని ఎప్పుడో నూతనంగా మార్చాడు (2కొరింథి 5:17, ప్రకటన 2:5). కాబట్టి దేవుని పిల్లలైన ప్రతివారు ఆయన ఇష్టాన్ని బట్టి, ఆయన అనాది సంకల్పమును నెరవేర్చుటకై సం॥లను, నెలలను, దినాలను క్రొత్తవిగా ఎంచి ఆనందించక తమ హృదయాలను, దాని ఆలోచనలకు కారణమైన మనస్సును నూతనపర్చుకొని తమ బ్రతుకును ఎప్పటికప్పుడు క్రొత్తదిగా చేసుకొని ఆనందించాలని దేవుడు మనలను హెచ్చరిస్తున్నాడు.

"కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదులుకొని, మీచిత్త వృద్ధియందు నూతనపరచబడినవారై, నీతియు యదార్థమైన భక్తిగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను." (ఎఫెసీ 4:22-24, రోమా 12:2, కొలస్సీ 3:10, తీతు 3:5).

నూతనసంవత్సర వేడుకలలో మనం పెట్టేఖర్చు మానివేసి దీనులు, దరిద్రులు, నిస్సహాయులై సహాయం కొరకు ఎదురుచూచే వారికి సహాయం చేస్తే దేవునికిష్టమైన ఆజ్ఞలను మనం నెరవేర్చినట్టే (మత్తయి 25:31-45) సర్వ ఆశీర్వాదములు దానితోనే ముడిపడియున్నాయి. దేవుడు మనలను ప్రతి దినం నూతనత్వం సంతరించుకొని ఆయన్ను ఆరాధించాలని కోరుకున్నాడు కాని ఎన్నటికి మారని బండలాంటి మొండి హృదయాలతో, పలు నిందలు వేసి, అనుమానాలతో, అబద్ధాలతో కాపురం చేస్తున్న పెదవులతో మొక్కుబడి స్తుతులను ఆలపించి, పాస్టర్ గారిని, తోటివారిని సంతోషపెట్టే పనులను మాత్రమే చేయుచు, నూతన సంవత్సర వేడుక దినమున తండ్రి ఆత్మను

ఎంత క్షోభకు గురిచేస్తున్నారో ఒక్కసారి ఆలోచించండి. ఎన్నో ఆశలు పెట్టుకొని కనిపెంచిన కన్న తల్లిదండ్రులను, కట్టుకొన్నవారిని గాలికొదిలేసి, వారి ఆశలపై నీళ్లుచల్లి తాను మాత్రం నూతన సంవత్సర వేడుకల్లో తిని, త్రాగి దైవ విరోధ కార్యక్రమాలు చేసే వారి పరిస్థితి చాలా దారుణమైన ముగింపుతో ఉంటుంది. ఎన్ని కొత్త సంవత్సరాల కోసం ఎదురుచూసినా లాభంలేదు కానీ ప్రతిదినం దేవునిలో ఆనందిస్తూ, పండుగ చేసుకొంటూ (సామెతలు 15:15) పనికిమాలిన వాటితో పరవశం చెందక మానవత్వంలోనుండి దేవత్వంలోనికి మార్పు చెంది మానవ కళ్యాణం కోసం కంకణం కట్టుకొని దివారాత్రులు శ్రమించడంతోనే నూతనత్వం ఉందిగాని మరి దేంట్లో కొత్తదనం లేదని ఆలోచించినవారే ధన్యులు.

మనిషి తయారు చేసిన గడియారంలోని ముల్లు ఒక్క సెకను మారగానే వచ్చే క్షణికానందంకోసం క్షణమొక యుగములా గడపకుండా, ఎంతో మంది చూడలేని దినాన్ని చూసే భాగ్యాన్నిచ్చిన దేవునికి ఎల్లవేళలా కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలి (ఫిలిప్పీ 4:4-7). క్యాలెండరులో తేది, నెల, సంవత్సరాలు మారుతున్నవేగాని, కాలం మారదు. గడ్డిపువ్వులా వికసించి క్షణికానందాన్ని పంచి మాడిపోయి రాలిపోయే వేడుక ఇది అని ఆలోచించి ఈలోక మర్యాదను అనుసరింపక ఒక్కరోజే హ్యాపీ న్యూ ఇయర్ అని పిచ్చి గంతులెయ్యక సంవత్సరములోని ప్రతిక్షణమును సత్సంవత్సరముగా చేసి వాక్యానుసారమైన అనగా సంవత్సరంలో బ్రతుకుతూ సంబరాలు చేయుమని దేవుడుకోరుచున్నాడు. దేవుడు మనలందరిని దీవించి, ఆశీర్వదించును గాక....

సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తున్న
మీ ఆత్మీయ సోదరుడు **డా॥ బొంకూరి జాన్**

**Dr. BONKURI JOHN,** Director & Evangelist
**Institute of Bible Technology Hyd & Temples of God Meet Here Church**
Ph : 040-20000700 Cell : +91-9440142887
e-mail : johnbonkuri@bhelhyd.co.in www.bibletechnology.net

**Bible College :** #06-264/13/1/5H, Aeronautics Enclave, Opp. Godavari Homes & Club
Suchitra Bus Stop to Quthbullapur Main Road, Chintal Post, Quthbullapur GHMC, Hyd-500 054, India

**for Free Bible Training** contact : **Bro. J. RAVI,** Admn. Officer - IBT, Cell : 9440792192
**Bro. D. PRASADA RAO,** Principal - IBT, Cell : 9959372221
9440551149, 9869469229, 9848961763, 9849554106, 9441727357, 9247128962,
9963623438, 9866509138, 9490453041, 9704692533, 9949242423, 9346373553

*ఈ అంశము కొద్ది మార్పులతో **సత్సంవత్సరం** అను పేరుతో 01-01-2011 సాక్షి దినపత్రిక ఫ్యామిలీ (సన్నిధి) పేజినెం. 3లో ప్రచురితమైనది.*